ప్రజాశక్తి
శుక్రవారం 24 జనవరి 2025 5 అనంతపురం

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కలెక్టర్ డా.వి.వినోద్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పూర్తి స్థాయిలో బాల్య వివాహాలను నిరోధించేలా అధికారులు పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కౌమార సాధికారత, బాల్య వివాహాల నివారణపై జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ శక్తి, కిశోరి వికాసంలో భాగంగా అనంత బాలికల స్వీయ రక్షణ కార్యక్రమంలో జిల్లాలోని 100 పాఠశాలలో సుమారు 50 వేల మంది బాలికలు స్వీయ రక్షణ నైపుణ్యాలు, సెల్ఫ్ అవేర్నెస్, మానసిక సాధికారత, ఓవరాల్ డెవలప్మెంట్ అనే అంశాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలను రెండో ఫేస్‌ను గురువారం నుంచి ప్రారంభించనున్నామన్నారు. బాల్య వివాహాలకు సంబంధించి జూలై 2023 నుంచి ప్రస్తుతం వరకు 544 కేసులు వచ్చాయని, వాటిలో 534 నిరోధించబడ్డాయని తెలిపారు. 10 కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఒక్క బాల్య వివాహం కూడా జరగడానికి వీల్లేదన్నారు. దీనిపై గ్రామాల్లో మరింత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ డా.ఈబి.దేవి, డీఈవో ప్రసాద్ బాబు, డివిజ. వెంకటరమణ నాయక్, డిటిడబ్ల్యూఒ. రామాంజనేయులు, ఐఅండ్‌పిఆర్ డిపిఆర్ఓ. గురుస్వామిశెట్టి, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి సూర్య ప్రతాపరెడ్డి, బిసి వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, ఐసిడిఎస్ ఎసిడిఒ వనజాక్షితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కారాగారాలు...!

◆ విద్యార్థులకు ఫీజుల వేధింపులు ◆ విద్యాసంస్థల్లో మానసిక క్షోభ

◆ కళాశాలల్లోనే తనువు చాలిస్తున్న యువత

◆ తాజాగా నారాయణ కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య

కార్పొరేట్ విద్యా సంస్థలు కారాగారాలుగా మారాయి. జైళ్లలో ఉన్న నిందితులకైనా కొంత స్వేచ్ఛ ఉంటుందేమోగాని... కార్పొరేట్ విద్యార్థులకు ఆమాత్రం కూడా ఉండడం లేదు. విద్యార్థులను ఫీజులు దండుకునే యంత్రాలుగా యాజమాన్యాలు చూస్తున్నాయి. ఏ మాత్రం ఫీజు చెల్లించడం ఆలస్యమైన ఆయా విద్యార్థులకు సిబ్బంది చేత నరకం చూపిస్తున్నాయి. వివిధ రూపాల్లో బహిరంగంగా అవమానాలకు గురి చేస్తున్నారు. ఇలా అవమానకర క్షోభను తట్టుకోలేని విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఏటా చోటు చేసుకుంటేనే ఉన్నాయి. తాజాగా అనంతపురం నారాయణ కళాశాలలో ఇంటర్ విద్యార్థి ఫీ'జులం'కు బలయ్యాడు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఫీజుల వేధింపుతో చరణ్ ఆత్మహత్య

శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం గ్రామీణ ప్రాంతానికి చెందన చరణ్ తల్లిదండ్రులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తమలాగా కష్టాలు పడకుండా తమ పిల్లాడికి మంచి భవిష్యత్ ఇవ్వాలన్న లక్ష్యంతో అనంతపురంలోని కార్పొరేట్ విద్యా సంస్థ నారాయణలో చేర్పించారు. ఫీజు సకాలంలో చెల్లించడంలో జాప్యం జరిగింది. చెల్లిస్తామని గడువు అడిగారు. దయలేని యజమాన్యం చరణ్‌ను బయట నిలబెట్టడంతోపాటు అవమానకరంగా మాట్లాడారు. గురువారం ఉదయం కళాశాలలో తోటి విద్యార్థుల మధ్య జరిగిన ఈ అవమానాన్ని తట్టుకోలేక తరగతి గది నుంచి విద్యార్థి బయటకొచ్చి మూడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంత జరిగినా యాజమాన్యం కనికరం చూపలేదు. విద్యార్థి ఆత్మహత్య ఫీజు కోసం కాదని తల్లిదండ్రులను మోసం చేసే ప్రయత్నం చేయడం గమనార్హం. వ్యక్తిగత సమస్యలతోచనిపోయినట్టు చూపించి తమకు న్యాయపరమైన ఇబ్బందులు కలుగకుండా చూసుకునే కుట్రకు తెరలేపడం శోచనీయం.

రూ.6 వేల కోసం భవ్యశ్రీ ఆత్మహత్యాయత్నం

ఇదే నారాయణ విద్యాసంస్థలో గతేడాది భవ్యశ్రీ అనే విద్యార్థి కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. తల్లిదండ్రులు వలస కార్మికులుగానున్న భవ్యశ్రీ కుటుంబం ఆరు వేలు ఫీజు కట్టడంలో జాప్యం జరిగింది. ఫీజు కోసం కళాశాల యాజమాన్యం వేధింపులతో భవ్యశ్రీ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఈ ప్రమాదంలో విద్యార్థికి ప్రాణాపాయం తప్పినా వెన్నెముక విరిగి ఆసుపత్రిలో చేరింది. వైద్య చికిత్సకు తల్లిదండ్రులకు రూ.13 లక్షలు ఖర్చు అయ్యింది. ఈ ఘటనతో భవ్యశ్రీ భవిష్యత్ అంధకారమయంగా మారింది. వెన్నెముక దెబ్బతినడంతో మంచానికే పరిమితమైంది.

చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల కోసం ఇలా అనేక ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోంది. ఈ కార్పొరేట్ కళాశాలల్లోనే వసతి గృహాల్లో కనీస వసతుల్లేవని ఎస్ఎఫ్ఐ గత వారంలో అనంత కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆర్ఐఒను కలెక్టర్ ఆదేశించారు. సదరు ఆర్ఐఒ ముందస్తుగా సమాచారమిచ్చి తనిఖీకి వెళ్లారు. తనిఖీల సమయంలో యాజమాన్యం అంతా బాగుందని చెప్పాలని విద్యార్థులపై ఒత్తిడి తేవడంతో అంతా బాగుందని సదరు అధికారి నివేదిక సమర్పించినట్టు సమాచారం. ఫీజు కట్టకున్నా విద్యార్థులకు వేదింపులకు గురి చేయకూడదని ప్రభుత్వం ఒకవైపు చెబుతున్నా ఆచరణలో మాత్రం కార్పొరేట్ విద్యా సంస్థలు పెడచెవిన పెడుతున్నాయి. ఫీజు కట్టని విద్యార్థులను తోటి విద్యార్థుల ఎదుటే అవమానాలకు గురి చేస్తున్నారు. ఇవి తట్టుకోలేని వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

విద్యార్థి చైతన్య (ఫైల్‌ఫొటో)

గురువారం నాడు అనంతపురం నారాయణ కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటున్న విద్యార్థి చైతన్య (ఫొటో దృశ్యాలు)

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన

విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన నారాయణ యాజమన్యాంపై కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐతో పాటు పలు విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ ఫీజు చెల్లించలేదని ఒత్తిడి చేయడంతోపాటు, అవమానించే విధంగా సిబ్బంది మాట్లాడడంతోనే విద్యార్థి చైతన్య ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. తక్షణం కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఈ ఘటనపై అధికారుల్లో ఎటువంటి చలనం లేకపోవడం విచారకరమన్నారు. ఘటన జరిగినా అటువైపు కూడా ఆర్ఐఒ కన్నెత్తి చూడలేదన్నారు. ఆర్ఐఒ వెంటనే స్పందించి నారాయణ విద్యా సంస్థలపై ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆర్ఐఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పద్మ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, విఎన్ఐవి రాష్ట్ర కార్యదర్శి వినోద్, జనసేన విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి సిద్ధు, ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ సాకే హరి, ఓసి విద్యార్థి సంఘం నాయకులు బుర్ర జయవర్ధన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధు, నాయకులు గిరి పాల్గొన్నారు.

నారాయణ కళాశాల వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

బీ ఫార్మసీ ఫలితాలు విడుదల

ఫలితాలను విడుదల చేస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో డిసెంబర్ నెలలో నిర్వహించిన బీఫార్మసీ ఫలితాలు విడుదల అయ్యాయి. ఒకటవ సెమిస్టర్ (ఆర్19) రెగ్యులర్, సప్లిమెంటరీ, మూడవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ, మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్ 19, 15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. ఫలితాలను ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ఆదేశాలతో విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగ ప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎపి.శివ కుమార్, అడిషనల్ కంట్రోలర్స్ జి.శంకర్ శేఖర్ రాజు, డా.ఎం.అంకారావు, డా.ఎస్.శ్రీధర్ తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం www.jntuaresults.in ను సంప్రదించాలని తెలిపారు.

సాగు, మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలి

కెవికె శాస్త్రవేత్త చిన్నరాయుడు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఉద్యాన పంటల సాగుతోపాటు మార్కెటింగ్‌పై రైతులు అవగాహన పెంచుకోవాలని కెవికె శాస్త్రవేత్త చిన్నరాయుడు సూచించారు. గురువారం స్థానిక కెవికెలో ఉద్యాన పంటల సాగు రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా కెవికె శాస్త్రవేత్తలతోపాటు డ్వామా ఎపిడి రమేష్‌నాయక్ రైతులకు సలహాలు, సూచనలను అందజేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంటలు సాగు చేసే ముందు నాణ్యమైన మొక్కలను ఎంచుకోవాలన్నారు. ముఖ్యంగా సేంద్రియ పద్ధతులో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. అదేవిధంగా పంటల దిగుబడి, డ్రిప్ నివారణలో భాగంగా సస్యరక్షణ చర్యలు మందుల పిచికారి తదితర అంశాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బాలశౌరి, హర్షిని, శిరీష, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల మరమ్మతులకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-గుత్తి

ప్రభుత్వ వసతి గృహ భవనాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారిణి బి.రాధిక తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలుర 1వ వసతి గృహానికి రూ.14.55 లక్షలు, కళాశాల బాలుర వసతి గృహానికి రూ.17.4 లక్షలు, పామిడి బాలుర వసతి గృహానికి రూ.24.51 లక్షలు, గడేకల్లు బాలుర వసతి గృహానికి రూ.13.5 లక్షలు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఇప్పటికే ఈ నిధులతో భవనాల మరమ్మతుల పనులు ప్రారంభించామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం మీకు తోడుగా తానుంటానని విప్ కాలవ భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలో బళ్లారి నుంచి బెంగళూరుకు వెళ్ల జాతీయ రహదారికి ప్రజాభిప్రాయం మేరకే వాహనాల అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని కొంతకాలంగా స్థానికులు పనులను అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బళ్లారి ఎంపి తుకారంతో కలిసి అండర్ పాస్ నిర్మాణం చేపట్టే ప్రాంతాన్ని పరిశీలించి స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారం కావాలంటే నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సారథ్యంలోనే జరగాల్సి ఉందన్నారు. ఫిబ్రవరిలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. ఆ సమయంలో తనతోపాటు బళ్లారి ఎంపీ తుకారాం అనంతపూర్ ఎంపీ ముగ్గురం కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర స్థాయి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీ సిరీస్ గంగాధర్, ఆర్‌డిఒ వసంతబాబు, తహశీల్దార్ మునివేలు, సిఐ వెంకటరమణ, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర డైరెక్టర్ నాగలి రాజు, టిడిపి మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

పాఠశాల భవనాలను పరిశీలన

మండల కేంద్రంలోని కోట ప్రాంతంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలను విప్ కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. భవనాల మరమ్మతులకు గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద 2, 3వ మూడో విడత అంటూ కాలయాపన జరిగిందని పాఠశాల హెచ్ఎం దేవరాజునాయక్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం విప్ మాట్లాడుతూ నూతన భవన నిర్మాణం కోసం సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, పుష్పావతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-పామిడి

నెల్లూరు జిల్లాలో వచ్చేనెల 1, 2, 3వతేదీల్లో నిర్వహించనున్న సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ ప్రాంతంలో సిపిఎం నాయకులు ఇందుకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఎద్దులపల్లి సర్కిల్, బీసీసీ రోడ్డు, మెయిన్ బజార్లలో మాస్ ఫండ్ క్యాంపియన్ చేపట్టారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. ఇందుకోసం 2021 నవంబర్‌లో నెల రోజులపాటు జిల్లావ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించి లక్ష మంది రైతులతో సంతకాలు సేకరించడంతోపాటు కలెక్టరేట్ ముందు 48 గంటల సత్యాగ్రహం చేపట్టి పంట నష్ట పరిహారం సాధించామన్నారు. అలాగే అంగన్వాడీలు 42 రోజులుగా సమ్మె చేస్తే సిపిఎం అండగా నిలిచిందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. ప్రజా పోరాటాల సారథి సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, రామునాయక్, ముత్యాలు, శంకర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

రోడ్డు ప్రమాదాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలి

డిఎంహెచ్ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్న ఆసుపత్రుల డాక్టర్లు రోడ్డు ప్రమాదాల వివరాలను ఎప్పటికప్పుడు ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా బేస్ (ఐరాడా) యాప్‌లో నమోదు చేయాలని డిఎంహెచ్ఒ ఇబి.దేవి సూచించారు. గురువారం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్న ప్రయివేటు ఆసుపత్రుల వైద్యులు, డేటా ఎంటర్ ఆపరేటర్లకు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ సోమలా నాయక్ ఐరాడా యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్న ఆసుపత్రుల వైద్యులు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి వచ్చే ప్రతి కేసునూ నమోదు చేయాలన్నారు. అలాగే అవసరాన్ని బట్టి మెరుగైన వైద్యం కోసం అన్ని వసతులు ఉన్న ఆసుపత్రులకు రెఫర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో డెమో త్యాగరాజ్, ఆరోగ్య భోధన అధికారి గంగాధర్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేష్, లీగల్ అడ్వైజర్ ఆశారాణి, శ్రీకాంత్, వివిధ ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

పోరాటయోధుడు జెడ్.వీరారెడ్డి

రైతు, కార్మిక, ప్రజా సమస్యలపై పోరాటాలు - నేడు 20వ వర్ధంతి

ప్రజాశక్తి-గుత్తి

రైతుగా, న్యాయవాదిగా, రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ క్రీడాకారుడుగా, సమితి అధ్యక్షులుగా, కమ్యూనిస్టునేతగా బహురంగాల్లో రాణించిన అరుదైన వ్యక్తి జెడ్.వీరారెడ్డి. గుత్తి తాలుకాలోని పెద్దవడుగూరు గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో జన్మించిన వీరారెడ్డి విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాల వైపు ఆకర్షితులయ్యారు. ఆ తరువాత కమ్యూనిస్టు నాయకునిగా మారారు. గ్రామంలో జాతీయోద్యమ ప్రభావం బలంగా ఉన్న సమయంలో ఆయన ప్రజలతో కలిసి పోరాటాలు చేశారు. పరిసరాల పరిశుభ్రత, గ్రంథాలయ నిర్వహణ, హరిజన సేవా కార్యక్రమాలను విద్యార్థులు, యువకులతో కలిసి నిర్వహించారు. జెడ్.వీరారెడ్డి తన మిత్రులతో కలిసి శ్రమదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఆరోగ్యం, శుభ్రత లాంటి విషయాలపై ప్రజల్లో తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్.వీరారెడ్డి ప్రాథమిక విద్య అనంతరం ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఆ క్రమంలో మార్క్సిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేసి కమ్యూనిస్టు భావాల వైపు ఆకర్షితులయ్యారు. వీరారెడ్డి చదువుతో పాటు రాజకీయ చర్చలు, ఆటల్లో ఎంతో చురుగ్గా ఉండేవారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించిన ఆయన 'లా' చదువు పూర్తి చేసి వత్తికి పరిమితం కాకుండా ప్రజా ఉద్యమాల్లో నిరంతరం పాలుపంచుకున్నారు. రైతు సంఘం ద్వారా రైతులను ఐక్యం చేసి అనేక పోరాటాలు చేపట్టి అందులో విజయం సాధించారు.

గుత్తి సమితికి జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రజాప్రతినిధిగా తన పదవీ కాలంలో తాలుకాలో విస్తతంగా పర్యటించి గ్రామాలకు మంచినీరు, పాఠశాలలు, విద్యుత్, రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పినకు ఎనలేని కృషి చేశారు. ప్రజాపోరాటాలతో గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీకి ప్రజలతో మంచి సంబంధాలు మెరుగు పర్చారు. గుత్తి రైల్వే కేంద్రంగా ఉండడంతో ఆ కార్మికులనూ కేంద్రీకరించి వారి సమస్యలపై ఉద్యమాలు చేశారు. ఒక వైపు రైతునేతగా పంటల గిట్టుబాటు ధరలు, సాగునీరు లాంటి సమస్యలపై పోరాడుతూనే మరో వైపు కార్మికులకు చట్టబద్ధంగా రావాల్సిన అంశాలపై కోర్టుల ద్వారా న్యాయపోరాటాన్ని కొనసాగించారు. కులాంతర ప్రేమ వివాహం చేసుకున్న ఆయన తన భార్య ఆదిలక్ష్మిని డాక్టర్ చదువు చదివించారు. డాక్టర్ కోర్సు పూర్తి అనంతరం గుత్తిలోనే ఆదిలక్ష్మితో వైద్యశాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సహాయం అందించారు.

వీరారెడ్డి తన 67 సంవత్సరాల వయసులో జిల్లాలో పట్టు రైతులను సమీకరించే పోరాటంలో భాగంగా హిందూపురం ప్రాంతానికి వెళ్లి అక్కడ జరిగిన పోలీసు లాఠీ చార్జీలో తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా వ్యాపితంగా పర్యటిస్తూ రైతు సంఘ నిర్మాణానికి కృషి చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఆయన 2005 జనవరి 24న గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. భౌతికంగా దూరం అయినా ఆయన పోరాటాలు నేటికీ వామపక్ష ఉద్యమానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ప్రజా ఉద్యమ నేతగా జీవితాంతం కృషి చేసిన వీరారెడ్డి 20వ వర్ధంతి కార్యక్రమాలను గుత్తిలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నారు.

జెడ్.వీరారెడ్డి (ఫైల్ ఫొటో)

గ్రామాల అభివృద్ధి దేశ ప్రగతికి చిహ్నం

ఎస్కెయు ఉపకులపతి బి.అనిత

ప్రజాశక్తి-అనంతపురం

గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశ ప్రగతి సాధ్యమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి బి.అనిత సూచించారు. గురువారం ఎస్కెయులోని సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఆధ్వర్యంలో 'గ్రామీణాభివృద్ధికి వ్యవసాయ రంగం, అనుబంధ రంగాల వ్యూహాలు' అనే అంశంపై జరిగిన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయం, అనుబంధ రంగాల్లో శాస్త్ర సాంకేతిక విధానాలను అవలంభించాలన్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లా లాంటి కరువు ప్రాంతాల్లోని రైతులు అభివృద్ధి చెందాలంటే వ్యవసాయంతో పాటు దాని అనుబంధ రంగాల్లో కూడా మెలకువలు పాటిస్తూ ఉత్పత్తి మార్కెటింగ్ సౌకర్యాలని తెలుసుకుని ముందుకు సాగాలన్నారు. పశు సంవర్ధక శాఖ సీనియర్ శాస్త్రవేత్త కృష్ణమూర్తి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ, గొర్రెలను పెంచడం వంటి రంగాల వైపు ముగ్గు చూపుతూ అధిక లాభాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ జి.వెంకటనాయుడు, ప్రిన్సిపాల్ ఎ.కృష్ణకుమారి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్‌పి.యల్లప్ప, సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ డైరెక్టర్ ఎంమని నారాయణప్ప, అసిస్టెంట్ డైరెక్టర్లు కె.వెంకటరెడ్డి, డి.శ్రీనివాసరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్కెయు ఉపకులపతి బి.అనిత

నీటి సరఫరా బంద్

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో రెండు రోజులపాటు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి నీటిని అందించే వీరాపురం పంప్‌హౌస్ వద్ద వాల్వ్ పగిలిపోయిందన్నారు. దీంతో 24, 25వతేదీల్లో పట్టణానికి నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

రాయలసీమకు హంద్రీనీవా జలాలే ప్రాణాధారం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్ టేబల్ సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాయలసీమ రైతాంగానికి హంద్రీనీవా కృష్ణాజలాలే ప్రాణాధారమని.. పాలక ప్రభుత్వాలు సక్రమంగా నీటి వాటాలు పాటించి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున అధ్యక్షతన గురువారం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ రైతాంగానికి కృష్ణాజాలాలే శరణ్యమన్నారు. నీటి వాటా కోటాలో సక్రమ పద్ధతులు పాటించకపోతే భవిష్యత్తులో రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. పాలకులు గమనించి రైతులకు నష్టంగా ఉన్న 404, 405 జిఓలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జె.రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులతో అసిస్టెంట్ కలెక్టర్ సమావేశం

అసిస్టెంట్ కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న గురువారం సమావేశమయ్యారు. ఇందులో భాగంగా కార్మికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ ఏర్పాటు చేయాలని, బకాయి వేతనాలు, డెత్ బెనిఫిట్స్, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి, మస్టర్ పాయింట్ల వద్ద మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం కార్మికుల సమస్యలపై మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఎర్రిస్వామి, సాకే తిరుమలేష్ కలిసి క్లుప్తంగా వివరించారు. ఇందుకు అసిస్టెంట్ కలెక్టర్ స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

'పివికెకె'లో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రుద్రంపేట పివికెకె పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం 'టోరే టెక్స్ టైల్స్' సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జిఎన్ఎస్ వైభవ్ మాట్లాడుతూ నియామకాల్లో 11 మంది పివికెకె ఐటి పాలిటెక్నిక్ విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వీరి వార్షికాదాయం రూ.2.09 లక్షలు ఉంటుందన్నారు. బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకట కృష్ణకిషోర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు బలమైన సాంకేతిక నైపుణ్యాలతో ముందుకు రావడమే ఈ విజయానికి కారణంమన్నారు. కళాశాల ట్రెజరర్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన వారు ఇదేస్ఫూర్తితో మరింత కష్టపడి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ప్రొఫెసర్ శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, అకాడమిక్ డీన్ సంతోష్ కుమార్‌రెడ్డి, సొసైటీ ప్రాంగణ నియామకాల అధికారి బాబా ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ కళాశాల గుర్తింపును రద్దు చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన నగర సమీపంలోని సోమలదొడ్డి వద్ద ఉన్న నారాయణ జూనియర్ కళాశాల బాయ్స్ హాస్టల్ అనుమతిని రద్దు చేయాలని వైసిపియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపిసి చదువుతున్న బత్తలపల్లి మండలానికి చెందిన చరణ్ హాస్టల్ బిల్డింగ్ 3వ ఫ్లోర్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. అంతేగాకుండా ఆత్మహత్య చేసుకున్న తర్వాత కళాశాల యాజమాన్యమే మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించడంతోపాటు రక్తపు మరకలను శుభ్రం చేయడం వెనుక పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఫీజుపై ఒత్తిడి తేవడంతోనే విద్యార్థి ఆత్మహత్యకు కారణమన్నారు. వెంటనే నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుత్తి

గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలకు సంబంధించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహశీల్దార్ డి.ఓబిలేసు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో డిటిలు, వీఆర్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాల వారిగా వచ్చిన భూ సమస్యల గురించి తెలపాలన్నారు. రైతులు, ప్రజల నుంచి అత్యధికంగా ఏ సమస్యకు వినతులు వచ్చాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారం గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇప్పటి వరకూ ఎన్ని సమస్యలకు పరిష్కారం చూపారో వివరించాలన్నారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో వాటికి సరైన సమాధానం రైతులకు తప్పకుండా లిఖిత పూర్వకంగా ఇవ్వాలన్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలు పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిటిలు శ్రీలత, లలితమ్మ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

నార్పల : మండల కేంద్రంలోని శివాలయం వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఆటో అంటుకుని ఉపాధి కోల్పోయిన వలస బాధితులకు టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ (బాబు) గురువారం రూ.5వేలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి జీవనోపాధికి వచ్చిన వారు ఉపాధి కోల్పోవడం బాధాకరమన్నారు. ఎస్ఐ సాగర్‌తో మాట్లాడి ఆటో ఇన్సూరెన్స్ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే బాధితులకు మార్నింగ్ వాకర్స్ బ్యాచ్ రూ.21,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకింగ్ బ్యాచ్ సభ్యులు బేకరీ శేషు, కోళ్ల పీరా చికెన్ సెంటర్ నిర్వాహకులు జాఫర్, సురేష్, బయపురెడ్డి, సంజీవరెడ్డి, సయ్యద్‌బాషా ఇలియాజ్, సలీం ఖాన్, టింకర్ బాషా, ముగేతంపల్లి కుళ్లాయప్ప, శంకర్‌రెడ్డి (రెడ్డి జ్యువెలర్స్) తదితరులు పాల్గొన్నారు.

సంసిద్ పాఠశాల విద్యార్థి ప్రతిభ

విద్యార్థిని అభినందిస్తున్న సంసిధ్ పాఠశాల యాజమాన్యం

అనంతపురం : అనంతపురంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం నిర్వహించిన క్లస్టర్ క్విజ్ పోటీల్లో (అనంతపురం క్లస్టర్) సంసిధ్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి సూరజిత్ సేథీ 3వ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ మధునిక తెలిపారు. సుభాష్ చంద్ర జయంతిని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సంసిధ్ పాఠశాలకు చెందిన విద్యార్థి బహుమతి సాధించడం సంతోషకంగా ఉందన్నారు.

పంటకోత ప్రయోగాలు

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం పరిధిలోని కందుకూరు గ్రామంలోని రాగే పరశురాముడు పొలంలో గురువారం పంటకోత ప్రయోగాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయం అధికారి జె.శశికళ, ఎఇఒ మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

జొన్నఇగురుతో జీవాలకు ప్రమాదం

పెద్దవడుగూరు : ప్రస్తుతం పొలాల్లో ఉంటున్న లేతజొన్న పంటలో హైడ్రోజన్ సైనైడ్ అనే విషపు పదార్థం ఉంటుందని, కావున గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ డివిజనల్ ఉపసంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, గుత్తి ప్రాంతీయ సహాయ సంచాలకులు పద్మనాభం సూచించారు. లేతజొన్న ఇగురు తిని బుధవారం రాత్రి మృతిచెందిన గొర్రెలను అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా లేత జొన్న ఇగురుపై గొర్రెల కాపరులకు అవగాహన కల్పించారు. లేతజొన్న పంటల వైపు గొర్రెలను తీసుకెళ్లరాదన్నారు. లేత జొన్న తింటే వైద్యం చేయడానికి కూడా ఆస్కారం ఉండదన్నారు. 57 గొర్రెలు చనిపోవడతో కాపరులకు సుమారు రూ.4లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో పెద్దవడుగూరు పశువైద్యురాలు కమలమ్మ, గోపాలమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉద్యోగుల టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉమామహేశ్వరమ్మ

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎపి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం రూపొందించిన టేబుల్ క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి దొగురు శ్రీహరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హెచ్.రూపేష్‌కుమార్, ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు వి.శశిధర్‌రెడ్డి, కార్యదర్శి విఎస్ నరసింహా, సహాధ్యక్షులు బి.ఆనందరాజు, కోశాధికారి డి.అదిల్‌బాషా, ఉపాధ్యక్షులు ఆర్.ఆంజనేయులు, నారాయణస్వామి, శివకుమార్, రామలింగరెడ్డి, సంయుక్త కార్యదర్శులు ఎ.నాగభూషణం, హెచ్.అనిల్, కె.రాజేష్, ఎ.మోహన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి

జాతీయ భద్రతా వారోత్సవాల్లో వక్తలు

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ నీలం వెంకట రాజాబాబు

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రయాణ సమయంలో ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాల నివారణకు సహకరించాలని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ నీలం వెంకట రాజాబాబు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలోని ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణ సమయంలో ఆటో డ్రైవర్లు సీటింగ్ కెపాసిటీకి మించి ప్యాసింజర్లను ఎక్కించుకోరాదన్నారు. నిబంధన మేరకే ప్రయాణికులను రవాణా చేయాలన్నారు. అలాగే ప్రయాణ సమయంలో మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదన్నారు. ఆటోలకు సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

తాడిపత్రి : రోడ్డు భద్రత వారోత్సవాల్లో అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమల్లో గురువారం ఏర్పాటు చేసిన డ్రైవర్ల మెడికల్ క్యాంపును ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వీర్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ముఖ్యంగా డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, రాజగోపాల్, అల్ట్రాటెక్ సిమెంట్ సంస్థ ప్రతినిధులు అంజన్ ప్రకాష్, చంద్రశాంత్, అల్ట్రాటెక్ కంపెనీ డాక్టర్లు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం బ్లాక్స్ స్పాట్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి రూరల్ ప్రాంతంలో ఉప రవాణా కమిషనర్ వీర్రాజు, ఆర్‌టిఒ రమేష్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు, పలువురు పోలీసులు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

ప్రజాశక్తి-గుత్తి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని విగ్రహానికి జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న, జిల్లా అధ్యక్షులు పి.వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షులు ఎ.రామాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు సీతానంద, శ్రీధర్ గౌడ్, దేశాయ్ నాగరాజు, గైడ్ రమేష్,నాగయ్య పాల్గొన్నారు. అలాగే భగత్ సింగ్, బోస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుత్తి రైల్వే లోకో షెడ్ సీనియర్ సెక్షన్ అధికారి బి. సుభాష్ బాబు అధ్యక్షతన జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ డిఎంఈ ప్రమోద్ కుమార్ హాజరయ్యారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్ సింగ్, బోస్ ఫెడరేషన్ నాయకులు నిజామొద్దీన్, రంగా, రమేష్, రైల్వే అధికారులు మంజునాథ్ ప్రభుదాస్, సుధాకర్, వేణుగోపాల్, పాపారావు, లూథర్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని విజన్ విద్యాసంస్థల్లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజన్ స్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్ సుభాస్ చంద్రబోస్ జీవితంతోపాటు ఆయన గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు.

పామిడి : స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి యూనిట్ ఆధ్వర్యంలో పాఠశాల నుంచి స్టేట్ బ్యాంకు దగ్గర ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించంచారు. అక్కడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్, ఎన్‌సిసి అధికారి రామాంజనేయులు, మాజీ ఆర్మీ లక్ష్మీనారాయణ, ఆర్మీ సురేంద్ర, ఎన్‌సిసి క్యాడేట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు

కేక్ కోస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

యువనేత, మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అనంతపురంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా కేక్ కోసం కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడుయాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్, మహిళా నాయకురాలు సంగా తేజస్విణి, తుల్జాపూర్ భవాని, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో కేక్ కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి టి.ఆదినారాయణ, గడ్డం సుబ్రమణ్యం, ప్రకాష్‌నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం : నగర సమీపంలోని చంద్రబాబు నాయుడు కొట్టాలలో నారా లోకేష్ ట్రస్టు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కొత్తకోట ఖాశీం ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కోసం కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12ఏళ్లుగా నారా లోకేష్ ట్రస్టు ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా టిడిపి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో నిరంతరంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రంపేట ఇన్‌ఛార్జి భక్తవచ్ఛల నాయుడు, టిడిపి నాయకులు బాలప్ప, కదిరెప్ప, వెంకట్రాముడు, ఆది, పెద్దన్న, నాగ, తదితరులు పాలొన్నారు.

వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంజుల మునిస్వామి

గుంతకల్లు : వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుంతకల్లు పట్టణానికి చెందిన మంజుల మునిస్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సిఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం వడ్డెర్లపై సానుకూల స్పందనకు నిదర్శనన్నారు. వడ్డెర్ల అభివృద్ధి, సంక్షేమంతోపాటు సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

బెలుగుప్ప : విద్యార్థులు విద్యలో ఉన్న స్థానాలకు చేరుకుని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పలువురు వక్తులు కోరారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ముద్రించిన ఎస్ఎస్‌సి మోడల్ పేపర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పి.మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్, పాఠశాల ఛైర్మన్ రుద్రయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి మహిళకూ చదువే ముఖ్యం : ఎంపిపి

బుక్కరాయసముద్రం : ప్రతి మహిళకూ చదువు నేర్పించడమే లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో 'ఉల్లాస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రాష్ట్రంలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా పని చేస్తూ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉషారాణి, ఎపిఎం నారాయణస్వామి, మండల సమైక్య అధ్యక్షురాలు, సిసిలు, విఓఎలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజయసాయికి బహుమతి

అనంతపురం : విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పిఠాపురం అనుబంధ సంస్థ ఉమర్ ఆలీషా సాహితీ సమితి భీమవరం నిర్వహించిన వ్యాసరచన పోటీలో జిల్లాకు చెందిన సాయి ట్రస్టు అధ్యక్షులు విజయసాయి కుమార్‌కు మొదటి బహుమతి లభించింది. ఈమేరకు గురువారం భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమర్‌ఆలీషా సాహితి సమితి జిల్లా అధ్యక్షులు రియజుద్దీన్, సుంకర రమేష్, శివ, రమేష్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

బొమ్మనహాల్ : మండలంలోని కందేపల్లి నుంచి బొమ్మనహాల్ వరకూ చేపట్టిన రోడ్డు పనులను ఆర్అండ్‌బి ఉరవకొండ డివిజన్ ఇఇ ప్రసాద్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఇందులోభాగంగా రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ జెఇ గోవిందరాజులు, డి.రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ, చైతన్య విద్యాసంస్థలను తరిమేయాలి

అనంతపురం : విద్యార్థుల ఆత్మహత్యలతో రాష్ట్రంలో మృత్యువుకు కేంద్రాలుగా మారిన నారాయణ, చైతన్య విద్యాసంస్థలను తరిమేయాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు పోతుల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోములదొడ్డి వద్ద ఉన్న నారాయణ కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో కళలు కన్న తల్లిదండ్రుల పరిస్థితి, వారి కడుపు కోతను ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ, చైతన్యలాంటి విద్యాసంస్థలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆధార్ క్యాంప్

పామిడి : కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని దుర్గమ్మ వీధి అంగన్వాడీ సెంటర్-2లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం గురువారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జెల్ నారాయణమ్మ, ఆధార్ ఆపరేటర్ మాబుఖాన్, తల్లులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

కౌమార దశపై అవగాహన

ప్రజాశక్తి-పామిడి

విషన్ శక్తి కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని కెజిబివి ఉన్నత పాఠశాల, ఆదర్శ ఉన్నత పాఠశాల, టిసి ఉన్నత పాఠశాలల్లో కౌమార దశలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, కరాటే బృందం, ఐసిపిఎస్ కళాజాతా బృందాలు నాలుగు టీంలుగా పాల్గొని విద్యార్థినులకు వివరించారు. ముఖ్యంగా బాల బాలికలందరూ సొసైటీలో జరుగుతున్న దారుణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వీయ రక్షణపై శిక్షణ తీసుకుని భవిష్యత్తును ఆనందమయం చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణమ్మ, అంగన్వాడీ టీచర్ జెల్.నారాయణమ్మ, అంగన్వాడీ గుత్తి ప్రాజెక్టు సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల కష్టాలను పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని అన్నదాతల కష్టాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. గురువారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడునెలలు గడుస్తున్నా రైతాంగ సమస్యలపై ప్రజాప్రతినిధులు కనీసం సమీక్ష చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశెనగ పంట తీవ్రంగా నష్టపోయినా సాయం అందించే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తామని హామీలు ఇచ్చి ఖరీఫ్ సీజన్ ముగిసినా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. మరోవైపు కంది పంటకు మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రజాప్రతినిధులు రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసిపి అధికార ప్రతినిధి చింతకుంట మధు, నిర్వాహక కార్యదర్శి వంకధార వెంకటకృష్ణ, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



అనంత వెంకటరామిరెడ్డితో వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షులు

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అనుబంధ సంఘాల నియామకాలు కొనసాగుతున్నాయి. తాజాగా అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా కసిరెడ్డి కేశవరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులుగా కైలాష్, అంగన్వాడీ విభాగం అధ్యక్షులుగా లావణ్య, దివ్యంగుల విభాగం అధ్యక్షులుగా ఎస్‌కె.కాలేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా వారందరూ అనంతపురంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపి బిసి సెల్ తాడిపత్రి అధ్యక్షులుగా రవికుమార్

సగర రవికుమార్‌కు కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వెంకటరామిరెడ్డి

తాడిపత్రి రూరల్ : వైసీపీ బీసీ సెల్ తాడిపత్రి నియోజకవర్గ అధ్యక్షురాలిగా గన్నెవారిపల్లి ఎంపిటిసి కత్తెరపల్లి రవికుమార్ (సగర) నియమితులయ్యారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వెంకటరామిరెడ్డి అభినందించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు జగన్ ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీలకు అందుబాటులో ఉంటూ బీసీ హక్కుల కోసం అందరినీ ఐక్యం చేద్దామన్నారు.

వైసిపి యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులుగా అబ్దుల్‌బాసిద్

గుంతకల్లు : వైసిపి యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులుగా అబ్దుల్‌బాసిద్‌ను నియమిస్తూ అధిష్టానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. విద్యార్థులు, యువతీ, యువకుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డికి, జిల్లా ఉపాధ్యక్షులు నైరుతీరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గ పబ్లిసిటీ విభాగం అధ్యక్షులుగా పూల రంగనాథ్

బుక్కరాయసముద్రం : వైసిపి నియోజకవర్గ పబ్లిసిటీ విభాగం అధ్యక్షులుగా పూల రంగనాథ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను పార్టీవైపు తీసుకొచ్చి బలోపేతం చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన ఆలూరు సాంబశివారెడ్డి, జొన్నలగడ్డ పద్మావతికి రుణపడి ఉంటామన్నారు.

మహిళా విభాగం అధ్యక్షురాలిగా పార్వతి

వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలిగా పార్వతి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా వైసిపి బలోపేతానికి తనవంతు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా మహిళలను పార్టీ వైపు తీసుకొచ్చేందుకు నియోజకవర్గం అంతా పర్యటిస్తానన్నారు. తన నియామకానికి ఆలూరు సాంబశివారెడ్డి, జొన్నలగడ్డ పద్మావతికి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల గదులు ప్రారంభం

యాడికి : మండల పరిధిలోని వేములపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో అజూర్ పవర్ కంపెనీ సహకారంతో దాదాపు రూ.40లక్షలతో నిర్మించిన గదులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కాశప్ప, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రీదేవి, సర్పంచు ఓంకారమ్మ, చుక్కలూరు రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనాన్ని రద్దు చేయాలని వినతి

యాడికి : మండల కేంద్రంలో 5వ తరగతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విలీనాన్ని రద్దు చేయాలని చౌడేశ్వరి కాలనీవాసులు కోరారు. గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంఇఒ కాశప్పకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 5వ నెంబర్ ప్రభుత్వ పాఠశాల ఛైర్మన్ కాల్లూరి నాగరాజు, ప్రజా మానవ హక్కుల జిల్లా కార్యదర్శి గుండా నారాయణస్వామి, తాడిపత్రి బిజెపి కో కన్వీనర్ పొట్టే గంగాధర్, బిజెపి మండల అధ్యక్షుడు చింతా చౌడయ్య, కూన వెంకటస్వామి, మార్కయ్య, మురళీ, వంకం నాగరాజు, స్వామిమోహన్, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌జెడికి అపుస్మా సన్మానం

ఆర్‌జెడిని సన్మానిస్తున్న అపుస్మా నాయకులు

అనంతపురం : జిల్లాకు విచ్చేసిన నూతన రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్‌ను అనంతపురం జిల్లా ప్రయివేట్ మేనేజ్‌మెంట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా ప్రయివేటు పాఠశాలల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ పాఠశాలల మేనేజ్‌మెంట్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్ స్టేట్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, రవిశంకర్‌ప్రసాద్, శ్రీనాథ్, పుల్లారెడ్డి, చంద్ర, సూర్యనారాయణరెడ్డి, శశిభూషణ్, రవిరాజా, శీన, శేఖర్, కరుణాకర్, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త దుర్గమ్మ మృతికి నివాళి

కళ్యాణదుర్గం రూరల్ : మండల పరిధిలోని ఎర్రంపల్లి గ్రామ ఆశా కార్యకర్త దుర్గమ్మ మృతికి సిఐటియు నాయకులు గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గమ్మ స్వగ్రామం చిన్నంపల్లిలో మృతదేహానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. నివాళులర్పించిన వారిలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్, ముదినేనిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ విజయేంద్రప్రసాద్, డాక్టర్ ప్రత్యూష, ఎంపిహెచ్‌ఇఒ వేణుగోపాల్‌రెడ్డి, ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు హరికృష్ణ, గంగరాజు, ముకుంద, తదితరులు ఉన్నారు.

కళ్యాణదుర్గంలో మెగా రక్తదాన శిబిరం

కళ్యాణదుర్గం : మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రజావేదికలో ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆధ్వర్యంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తర్వాత చీరలు పంపిణీ చేశారు. అదేవిధంగా పేదలకు ఇంటి స్థలాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కరణం రామ్మోహన్‌చౌదరి, వైపి రమేష్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

హంద్రీనీవా కాలువకు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ పనులను వేగవంతంగా చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఇంద్రావతి గ్రామ సమీపంలో శిథిలావస్థకు చేరుకున్న డిస్ట్రిబ్యూటరీ కాలువను సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ పనులు లైనింగ్ కాకుండా వెడల్పు చేసి జిల్లాకు అదనంగా నీటిని తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జె.మల్లికార్జున, చెన్నారాయుడు, సుల్తాన్, తిప్పయ్య, నవీన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

రాయదుర్గం : రాయదుర్గం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం 10 బాక్సుల కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకు ఓ ఇంట్లో తనిఖీ చేయగా ఇద్దరు వ్యక్తులు పరారీ అయ్యారన్నారు. దీంతో అక్రమంగా నిల్వ ఉంచిన 10 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.50వేలు ఉంటుందన్నారు. తమ విచారణలో ఎరుకల నాగరాజు, చాకలి విశ్వనాథ్ మద్యాన్ని నిల్వ ఉంచినట్లు తేలిందన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు.